## ఒడ్డికైన పయనానికి ఒడిస్సీ సూట్ కేస్

వి.ఐ.పి. సూట్ కేసులు తయారుచేసే సంస్థ ఇప్పుడు సరికొత్తగా ఒడిస్సీ సూట్ కేసులు మార్కెట్‌లోకి ప్రవేశపెడుతోంది. ఎ.బి.ఎస్. షీట్స్‌తో తయారుచేసే ఈ సూట్ కేస్‌కు కొన్ని ప్రత్యేకతలు వున్నాయి.



ఈ సూట్ కేస్ చూడడానికి చాలా హుందాగా వుంటుంది, మిగతా సూట్ కేసులకన్నా పటిష్టంగా వుంటుంది. బరువు తక్కువగా వుండడం వల్ల ప్రయాణానికి చాలా అనువైనది. రెండు రకాలుగా పనిచేసే లాకింగ్ సిస్టమ్స్ వల్ల తాళం వేయకపోయినా సూట్ కేస్ విడిపోదు. విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న తాళాలను వాడడంవల్ల అదనపు భద్రత కూడా చేకూరుతుంది. మామూలు సూట్ కేసులపైలాగా దీనిపై త్వరగా గీతలు పడవు. ఈ ఒడిస్సీ సూట్ కేస్ ధర 1200 రూపాయిల నుంచి వుంటుంది.

—కిస్నా




# పాపం.... పసి బిచ్చగాడు

## —జయంతి

అసలే అది వేసవికాలం. మిట్ట మధ్యాహ్నం. రోహిణీకార్తె. ఎండ నిర్దాక్షిణ్యంగా నిప్పులు చెరిగి పోస్తోంది. ఆ ధాటికి తట్టుకోలేక కుతకుతలాడిపోతూ పొగలు, సెగలు పైకి ఎగజిమ్ముతోంది నల్లని తారురోడ్డు.

అదొక మహానగరం నడిబొడ్డేమో... మహా రద్దీగా వుంది. ప్రక్కనే వున్న ఓ బస్టాపులో సకాలంలో రాని సిటీ బస్సుల కోసం పడిగాపులుకాస్తూ, ఇసుక పొయ్యిలో పేలాల్లా పెళపెళ లాడిపోతున్నారు 'సిటీ' జనులు ఉస్సురంటూ.

వాళ్ళ ముందు నిలబడి "అయ్యా ధర్మం.. అమ్మా ధర్మం" అని చేయి సాచి యాచిస్తున్నాడు ఓ ఆరేళ్ళ పసి బిచ్చగాడు ఏ ఆచ్ఛాదనా లేని అతని ఆకలి కడుపును చూపిస్తూ. ఏ తండ్రి పుణ్యం వల్లనో, ఏ తల్లి కడుపులోంచి పూడిపడ్డ పాపమో ఏమో గాని, పాపం... ఉదయం నుండీ ఎండలో బడి 'ధర్మం' కోసం నిలపిస్తున్నాడు నిముగూ, విరామం లేకుండా.

అయినా, ఏ ధర్మ ప్రభువు వాడి మీద ఇంత జాలి చూపించలేదు. ఒక్క పయాసైసా 'ధర్మం' వాడికి దక్కనిలేదు.

పైన నెత్తి, కింద కాళ్ళూ, లోన కడుపూ మాడుతున్నా అదే పనిగా, పేగులు తెగిపోయేలా అరుస్తున్నాడేమో... అరచి అరచి... గొంతెండిపోయింది వాడికి.

గ్రుక్కెడు మంచి నీళ్ళు గొంతులో జారితే గాని గొంతు పెగలని పరిస్థితి. ప్రక్కనే వున్న వీధి పంపు దగ్గర కెళ్ళి కుళాయి తిప్పి చూశాడు ఆశగా. అందులోంచి నీళ్ళ రాలేదు.

నీరసంగా వెనుదిరిగి, బస్టాపుకి మరో వైపున వున్న చలివేంద్రం ముందు నిలుచుని మంచినీళ్ళు కావాలని సైగ చేశాడు మాట్లాడే ఓపిక లేక. పది పైసలిస్తేనే గాని మంచినీళ్ళు ఇవ్వనన్నాడు 'చలివేంద్రం' మనిషి. పాపం. వాడు మాత్రమేం చేస్తాడు. దేశంలో నీటి దరిద్రం కూడా!

నిరాశగా, నిస్సత్తువగా, నిస్పృహగా వెనుదిరిగిన వాడి కళ్ళకి దూరంగా నల్లని తారు రోడ్డు మీద తళ తళా మెరుస్తూ కనిపించిందో వస్తువు.

ఆశతో వాడి కళ్ళు మెరిశాయి. ఆనందంతో వాడి గుండె ఉప్పొంగిపోయింది. ఉత్సాహం ఉరకలు వేసింది. అంత వరకూ వాడిలో ఆవహించిన నీరసం, నిస్సత్తువ, నిస్పృహ ఒక్కసారి ఎగిరిపోయాయి. వడివడిగా అడుగు వేశాడు.

వాడికి వచ్చిపోయే వాహనాలు... రణగొణ ధ్వనులు ఏవీ వినిపించడం లేదు. వాడికి కనిపించేదల్లా నల్లని తారు రోడ్డు మీద తళ తళా మెరిసే వస్తువు... వినిపించేదల్లా గ్రుక్కెడు మంచినీళ్ళ కోసం వాడి ఆత్మ చేసే ఘోష.

ఎలాగైతేనేం రోడ్డు మధ్యనున్న ఆ తళ తళ మెరిసే వస్తువును సమీపించాడు. దాన్ని చేజిక్కించుకున్నాడు. ఏదో తెలియని తృప్తి... ఆనందం... ప్రపంచాన్నే జయించినంత సంబరం చోటు చేసుకున్నాయి వాడి మనసులో. విజయ గర్వంతో వెనుదిరిగాడు.

ఇప్పుడు వాడి కళ్లకి కనిపించేది చలివేంద్రం... గ్లాసుడు మంచినీళ్ళు. ఈ రెండూ తప్ప మరేమీ వాడికి కనిపించడం లేదు. వడి వడిగా చలివేంద్రం వైపు అడుగు వేశాడు.

అంతలోనే అశనిపాతంలా దూసుకొచ్చింది ఓ బస్సు. కెవ్వుమని కేక వినిపించింది. 'కీచ్' మంటూ మూలుగుతూ ఆగిపోయింది బస్సు.

డ్రైవరూ, కండక్టరూ కంగారుగా బస్సు దిగారు. వారిద్దరినీ అనుసరిస్తూ బస్సులోని జనం కూడా దిగారు "ఏక్సిడెంట్... ఏక్సిడెంట్" అంటూ.

నల్లని తారు రోడ్డు మీద ఎర్రని నెత్తుటి మడుగులో అచేతనంగా పచ్చి పడివున్నాడు ఆరేళ్ళ పసి బిచ్చగాడు. వాడి కుడి అరచేతిలో తళతళా మెరుస్తున్న వస్తువు మీద పడ్డాయి అందరి కళ్ళు.

"గుంట వెధవ... వెధవ ముష్టి పది పైసల కోసం ప్రాణం పోగొట్టుకున్నాడు. ఇలాంటి దరిద్రపు వెధవలున్నంతకాలం ఈ దేశంలో ఏక్సిడెంటులు జరుగుతూనే వుంటాయి. ఈ దేశం మరి బాగుపడదు" అన్నాడొక ధనిక వర్గపు మేధావి.

"అవును... నిజమే. ఈ దేశం బాగుపడదు" అంటూ తలలూపారు అక్కడ చేరిన గొర్రెల మంద లాంటి జనం. ●

